జాబ్ మేళాకు విశేష స్పందన



వివిధ కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగులతో శైలజ

నాంపల్లి: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ మల్లేపల్లి ప్రాంగణంలో నిర్వహించిన ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా, జాబ్‌మేళాకు విశేషమైన స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాలో సుమారు 45 కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇందులో ప్రభుత్వ సంస్థలైన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ(టామ్‌కామ్), టీఎస్ఆర్టీసీ, మిథాని, హెచ్ఎఫ్‌సిఎల్‌తో పాటు మారుతి, వీఈఎమ్ టెక్నాలజీస్, మిత్రా ఏజెన్సీ, ఎం-టార్, రాక్‌వెల్, హెచ్‌బీఎల్ ఇండస్ట్రీస్ వంటి కంపెనీలు వచ్చాయి. జాబ్‌మేళాకు సుమారు 673 మంది హాజరుకాగా 362 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉప సంచాలకులు ఎస్.రాజా, ప్రిన్సిపాల్ దోవ శైలజ పాల్గొన్నారు.

విద్యా వికాసానికి పరిశోధన కీలకం



మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణ

చార్మినార్: విద్యా వికాసానికి పరిశోధన కీలకమని కేరళ సెంట్రల్ యూనివర్సిటీ సహాయాచార్యులు డాక్టర్ రామకృష్ణ బండారు అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో పరిశోధన ఆవశ్యకత, మార్గదర్శకాలు, విశ్లేషణాత్మక పద్ధతులపై ఒకరోజు వర్క్‌షాప్‌ను కామర్స్ మేనేజ్మెంట్ విభాగం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా.రామకృష్ణ బండారు ప్రధాన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరిశోధన విద్యా వికాసానికి ఎంతో కీలకమని పేర్కొంటూ ప్రేరణాత్మకంగా, ఆలోచనాత్మకంగా ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పరిశోధన విధానాలు, డేటా సేకరణ, విశ్లేషణ పద్ధతులు, నివేదిక తయారీ, నైపుణ్యాల పెంపు తదితర అంశాలపై ఆయన వివరించారు. డా.ఝాన్సీ రాణి సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో విభాగ అధ్యక్షుడు డా.మల్లికార్జునరావు, ఇఫత్ ఉన్నీసా, లలిత, డా.రవీంద్ర బాబు, డా.వి.శిరీష, భార్గవి, రాజేష్, సత్యనారాయణ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

'మద్యం తాగి వాహనాలు నడపొద్దు'

చార్మినార్: మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదానికి గురతూ తమ కుటుంబానికి శాశ్వతంగా దూరం కావద్దని చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి చార్మినార్ కట్టడం నుంచి గుల్జార్ హౌజ్ వరకు పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ ఆధ్వర్యంలో చార్మినార్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ ర్యాలీ నిర్వహించి, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..రోడ్డుపై తమ ప్రాణాలతో పాటు ఇతర వాహనదారుల ప్రాణాలు కూడా కాపాడాలని ఆయన కోరారు. చార్మినార్ నుంచి గుల్జార్ హౌస్ వరకు ఆటో, క్యాబ్ డ్రైవర్లతో బ్యానర్లు, ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కె.నర్సింగ్ రావు, జి.కరుణాకర్‌రెడ్డిలతో పాటు టీఆర్‌పీఎస్ చార్మినార్ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



హిమ్మత్‌పురా నుంచి చౌమహల్లా ప్యాలెస్‌కు వెళ్లే రహదారి దుస్థితి

శాలిబండ: హిమ్మత్‌పురా నుంచి చౌమహల్లా ప్యాలెస్‌కు వెళ్లే రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని గుంతలమయంగా మారడంతో ఈ దారిలో వాహనదారులు నడవలేని పరిస్థితి నెలకొంది. వాహనదారులు ప్రమాదాల బారిన సైతం పడుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ప్రభుత్వం ఈ సమస్యపై తక్షణమే పరిష్కరించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

తవ్వారు..వదిలేశారు..

- మట్టికుప్పలు, గుంతలమయంగా ప్రధాన రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



టోలిచౌకీ చౌరస్తా ఆలయం పక్కన భారీ గుంత



టోలిచౌకీ-టూంబ్స్ రోడ్డుపై మట్టికుప్పలు

గోల్కొండ: అభివృద్ధి పనుల పేరుతో కాంట్రాక్టర్లు రోడ్లను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. పనులు పూర్తి అయిన చోట రోడ్డును చదును చేయకుండా మట్టికుప్పలను అలాగే వదిలేస్తున్నారు. పలు చోట్ల డ్రైనేజీ పనులు, మరికొన్ని చోట్ల వరద నీటి పైపు పనులు రెండేళ్ల నుంచి కార్వాన్ నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో జరుగుతున్నాయి. లంగర్‌హౌస్, టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్లలో వరద నీటిని నేరుగా లంగర్‌హౌస్ మూసీ నదిలో కలపడానికి పనులు జరుగుతున్నాయి. మరో వైపు డ్రైనేజీ లైన్‌లను ఆధునీకరించే పనులు కూడా కొనసాగుతున్నాయి. ఈ కారణంగా ఆయా ప్రాంతాల్లో రోడ్లను భారీగా తవ్వుతున్నారు. పైపులు వేయడానికి తవ్విన గుంతలు లోతైన బావులను తలపిస్తున్నాయి. ప్రధాన చౌరస్తాల వద్దనే కాకుండా ప్రధాన రహదారులపై పైపులైన్‌లు వేయడానికి భారీగా రోడ్డును తవ్వుతున్నారు. అయితే ఈ పనులు కాస్తా మరి నెమ్మదిగా కొనసాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

18 నెలలుగా పూర్తి కాని పనులు..

టోలిచౌకీ నుంచి అక్బర్‌పురా మీదుగా మోతీదర్వాజా వెళ్లే రూట్‌పై కూడా 18 నెలలు గడుస్తున్నా పనులు ఇంకా పూర్తి కాలేదు. ఇదిలా ఉండగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్‌ను నివారించుకోవడానికి వాహనాదారులు ప్రధాన రహదారిని ఆనుకోని ఉన్న బస్తీలు, కాలనీల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీన్ని వల్ల దుమ్ముధూళి నుంచి తమను తాము రక్షించుకోవడానికి 24 గంటల పాటు ఇళ్ల కిటికీలు, తలుపులు మూసి ఉంచుకుంటున్నామని టోలిచౌకీ అక్బర్‌పురాకు చెందిన ఏ.అశోక్‌కుమార్ అంటున్నారు.

ప్రమాదాల పరంపర..

- భారీగా గుంతలు తవ్విన ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఎన్నో ప్రమాదాలు జరిగాయి. గత సంవత్సరం టూంబ్స్ రోడ్డుపై పైపులు వేయడానికి తవ్విన భారీ గుంతలో ప్రమాదవశాత్తు ఓ వృద్ధుడు కాలుజారి గుంతలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు.
- గత వర్షాకాలంలో ఓ గుంతలో ద్విచక్ర వాహనదారుడు వాహనంతో సహా పడిపోయాడు. దారిన పోయే వారు ఆ వ్యక్తిని బయటకు తీసి ప్రాణాలను రక్షించారు. గత సంవత్సరం వర్షాలకు దెబ్బ తిన్న రోడ్లు ఇంకా బాగుపడలేదు. దీని వల్ల పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇకనైనా పనులను వెంట వెంటనే పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు..



కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా రోడ్లపైకి రావాలంటే భయం వేస్తుంది. ముఖ్యంగా టోలిచౌకీ చౌరస్తాను కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేశారు. అధికారులకు ఈ విషయం తెలిసినా పనులను సకాలంలో పూర్తి చేయించడం లేదు. పనులు త్వరగా పూర్తి చేసి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– మిర్జా అహ్మద్ బేగ్

పనులను సకాలంలో పూర్తి చేయించాలి..



అభివృద్ధి పనులను సంబంధిత అధికారులు పరిశీలించడం లేదు. ఈ కారణంగానే పనులు సకాలంలో పూర్తి కావడం లేదు. మహిళలు, వృద్ధులు పనులు జరుగుతున్న చోట నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నోసార్లు గుంతల్లో ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురయ్యారు. అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎప్పటికప్పుడు పరిశీలించి పనులు సకాలంలో పూర్తి చేయించాలి.

– సాయిబాబాచారి

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న అన్నారు. ఆయన పర్యవేక్షణలో సోమవారం సర్దార్‌మహల్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, పారిశుద్ధ్య, వీధి దీపాలు, రోడ్డు నిర్మాణం పనులు, పార్కు సమస్య, అక్రమ నిర్మాణం, అక్రమ ఫుడ్ స్టాల్స్ సమస్యలపై మొత్తం 7 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత విభాగాలచే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజ, ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ (ఎస్‌డబ్ల్యూఎం) శంకర్ సింగ్, ఏఎంసీ రాజారావు, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బి, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మజీద్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో సత్తాచాటిన వంశీ



వంశీని సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థి పి.వంశీ ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో విజయం సాధించి బంగారు పతకాన్ని సాధించాడు. 2023లో గుజరాత్‌లో జరిగిన నేషనల్ గేమ్స్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సాధించి క్రీడల్లో రాణిస్తున్నారు. ఈ సందర్భంగా వంశీని మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ రాకేష్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీపతిరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు జి బెనకోప్, కళాశాల ఎంబీఏ హెచ్ఓడి డాక్టర్ సుజాత మొండేటిలు వంశీని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. వంశీ జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలను సాధించి కళాశాల ప్రతిష్ఠను పెంపొందించడంతో పాటు రాష్ట్ర ప్రతిష్ఠను పెంపొందిస్తున్నారని కొనియాడారు. స్పోర్ట్స్ కో ఆర్డినేటర్‌లు శ్రీకాంత్ పంతంగా, షమీమిలియాస్, పీఆర్‌ఓ రేణికుంట శ్రీకాంత్‌లు వంశీని అభినందించారు.

బస్తీ సమస్యలను పరిష్కరించండి

గౌలిపురా: పటేల్‌నగర్ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బస్తీవాసులు డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ మేయర్‌ను ఆమె కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ..పటేల్‌నగర్ బస్తీ సమస్యలను వివరించామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యల తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, రేణుకాఎల్లమ్మ ఆలయ చైర్మన్ సాకెల్లి సర్వేశ్, కమిటీ సభ్యులు వినోద్, మధుచారి, సతీష్, కృష్ణ, నరేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ మేయర్‌ను కలిసిన పటేల్‌నగర్ బస్తీవాసులు

యాకుత్‌పురా సర్కిల్‌లో సర్వే ప్రక్రియ పూర్తి



సర్వేపై సిబ్బందితో ఆరా తీస్తున్న సురేందర్

యాకుత్‌పురా: యాకుత్‌పురా సర్కిల్ పరిధిలో నూతన రేషన్ కార్డుల కోసం చేపట్టిన సర్వే ప్రక్రియ పూర్తయిందని పౌర సరఫరాల శాఖ యాకుత్‌పురా-02 సర్కిల్ ఏసీఎస్‌ఓ సురేందర్ తెలిపారు. సోమవారం ఆయన సర్కిల్ పరిధిలోని తలాబ్‌కట్టా, చాచా గ్యారేజ్, నషేమన్‌నగర్, సిద్దిఖీనగర్‌లో ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందితో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రేషన్ కార్డుల కోసం తమకు అందిన 7935 నూతన దరఖాస్తులను ఇంటింటికీ తిరిగి విజయవంతంగా పూర్తి చేశామన్నారు. సర్వేలో గుర్తించిన లబ్ధిదారుల జాబితా వివరాలను ఈ నెల 21న జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తామని ఆయన తెలిపారు.

స్వాతి శ్రీపాదకు సాహితీ పురస్కారం



పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ రాధారాణి, కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: పద్మ భూషణ్ డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్యం, రచనలు ఎంతో వినసొంపుగా ఉంటాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో రసమయి, శ్రీమతి సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి స్వాతి శ్రీపాదకు సుశీల నారాయణరెడ్డి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతకు ముందు సినారే గాన వైభవం, నృత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, హెచ్‌సీయూ ప్రొఫెసర్ వంగరి త్రివేణి, సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ అధ్యక్షులు సి.గంగా, కార్యదర్శి జె.చెన్నయ్య, రసమై సంస్థ అధ్యక్షులు ఎంకే.రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



ఏసీపీని సన్మానిస్తున్న మహ్మద్ ఇదాయత్ అలీఖాన్

గోల్కొండ: విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్ స్పోర్ట్స్ మీట్ పర్వాజ్ 2024-25ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇండోర్, అవుట్ డోర్ క్రీడల్లో తెలంగాణ జిల్లాల విద్యార్థులు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు విశేషంగా ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. పలువురు జూనియర్, సీనియర్ స్థాయిలో జాతీయ క్రీడల్లో కూడా పాల్గొని విజయాలు సాధిస్తున్నారన్నారు. విద్యార్థులు చదువులో రాణిస్తునే క్రీడల్లో కూడా తమ ప్రతిభను చాటుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రేషన్ ఫరాజుద్దీన్, వీనస్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇదాయత్ ఆలీఖాన్ తదితరులున్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

గన్‌ఫౌండ్రీ: మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న మాస్టర్స్ స్కూల్ గేమ్స్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రామారావు మాట్లాడుతూ..విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులతో రామారావు తదితరులు

ముద్గర్ పోటీ విజేత సమీర్‌ఖాన్



సమీర్‌ఖాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: ముద్గర్, రెజ్లింగ్ పోటీల్లో గోల్కొండ నయాకిలాకు చెందిన మహ్మద్ సమీర్‌ఖాన్ తన సత్తాచాటారు. ముద్గర్ అఖాడా వారు నిర్వహించిన ముద్గర్ మల్లన్న చాంపియన్‌షిప్ పోటీల్లో మహ్మద్ సమీర్‌ఖాన్ 511వ సార్లు ముద్గర్‌ను తింపి విజేతగా నిలిచారు. స్థానిక మజ్లిస్ ఏరియా కమిటీ నాయకుడు సిరాజ్ పట్టేదార్ ఈ సందర్భంగా మహ్మద్ సమీర్‌ఖాన్‌ను పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిర్జా ఎక్బాల్ అహ్మద్, మహమూద్ ఖాన్, మహ్మద్ సమీర్ తదితరులున్నారు.

ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం

గన్‌ఫౌండ్రీ: గణతంత్ర్య దినోత్సవ ఉత్సవాలను పురస్కరించుకొని ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. సోమవారం ఎల్బీస్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఉద్యోగుల క్రీడా పోటీలను ప్రారంభించారు. నాలుగు జెట్లుగా ఏర్పడిన ఉద్యోగులకు క్రీడా పోటీలను నిర్వహించారు. మహిళా ఉద్యోగుల కోసం మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ వంటి క్రీడలు జరిగాయి.



ఉద్యోగులతో మాజీ ఎంపీ వీహెచ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీఏడీ ఒక ప్రకటనలో తెలిపారు. రమా టాకీస్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..కమేలా విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు..దూద్‌బౌలి విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. పటేల్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని పటేల్‌నగర్, లలితాబాగ్, అంబికానగర్, ఖాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. గౌలిపురా విద్యుత్ ఫీడర్ పరిధిలోని గౌలిపురా, మేకలమండి, సీఐబీ క్వార్టర్స్ , సుల్తాన్‌షాహి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఛత్రినాక విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఛత్రినాక, బోయిగూడా, శ్రీరామ్‌నగర్, మగ్దుం పుర, గౌలిపుర, మురాద్‌మహల్, బాలాగంజ్, లాల్ దర్వాజా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నేటి నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

దూద్‌బౌలి: అర్హులందరూ రేషన్ కార్డు కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ సర్కిల్-3 అస్లం ఖాన్ తెలిపారు. ప్రజా పాలనలో సర్కిల్-3 పరిధిలో 5100 మంది రేషన్ కార్డు కోసం దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. వాటిని సివిల్ సప్లై, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పరిశీలన పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం నుంచి తమ బస్తీలలోని వార్డు కార్యాలయంలో నూతన రేషన్ కార్డులు, పాత రేషన్ కార్డులు గల వారికి అందులో పేర్లు చేర్చుకునే అవకాశం కల్పించిందని..వాటికి కూడా దరఖాస్తు చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.

దివ్యాంగులకు అండగా మజ్లిస్



దివ్యాంగులకు ట్రై సైకిల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: దివ్యాంగులకు మజ్లిస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన వరల్డ్ డిజబుల్ డే సందర్భాన్ని పురస్కరించుకొని కార్వాన్‌లో దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి సహాయ పరికరాలు అందించే విషయంలో తాను ఎప్పుడు ముందుంటానని అన్నారు. దివ్యాంగులను గుర్తించి అటువంటి వారి జాబితాను జీహెచ్‌ఎంసీ యూసీడీ విభాగం వారికి అందించడం జరిగిందన్నారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన దివ్యాంగులకు వారికి ప్రభుత్వ పెన్షన్ అందేలా గతంలో తాను ఎంతో కృషి చేశానన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, వజీవుజ్‌జమా, హారూన్‌ఫరాన్, అమీరుద్దీన్‌తో పాటు మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

సంతోష్‌నగర్‌లో ఫ్లాగ్‌మార్చ్



సంతోష్‌నగర్: ప్రజలకు మేమున్నామంటూ భరోసా కల్పించేందుకు స్టేషన్ పరిధిలో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించామని సంతోష్‌నగర్ ఇన్‌చార్జి ఏసీపీ కె.మనోజ్ కుమార్ అన్నారు. సంతోష్‌నగర్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని రక్షాపురం, జమాల్ కాలనీ, మోయిన్‌బాగ్, ఈదిబజార్, కుమ్మర్‌వాడీ తదితర ప్రాంతాల్లో ఈ ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: వరద, మురుగు నీటి సమస్యల పరిష్కారానికి డ్రైనేజీ పైప్‌లైన్ పనులను చేపట్టామని రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. మదీనానగర్ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన డ్రైనేజీ పనులను సోమవారం ఆయన నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ వసీముద్దీన్, జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహా కుంభమేళాలో లంగర్‌హౌస్ సంగమం ఖల్సా సేవలు



సంగమం ఖల్సాలో పూజలు అందుకుంటున్న లంగర్‌హౌస్‌లోని సీతారామ లక్ష్మణులు

లంగర్‌హౌస్: మహా కుంభమేళాలో లంగర్‌హౌస్ త్రివేణి సంగమం రాంచంద్రజీ మఠం అఖాడా, ఖల్సాకు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివస్తున్నారు. ఆరు రోజుల్లో దాదాపు లక్ష 30 వేల మంది భక్తులు ఇక్కడ పూజల్లో ఉన్న నాగసాధువులు, దిగంబర బాబాలను దర్శించుకున్నారు. నిత్య పూజలతో పాటు ఇక్కడ నిత్యం అన్నదానం, వసతి కల్పిస్తున్నారు. సాధుసంతులు, మహంత్‌లు, నాగసాధువులు, కల్పవాసీల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కుంభమేళాలో శ్రీరాంచంద్ర జీ మఠం పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో పూజలు, సేవలు నిర్వహిస్తున్నారు. గంగా, యమునా, సరస్వతి నదుల కలయిక అయిన ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో నిర్వహిస్తున్న ఈ కుంభమేళాలో దక్షిణ భారతదేశం నుంచి ప్రధానంగా కేవలం తిరుమల హాథీరామ్ జీ మఠం, లంగర్‌హౌస్ త్రివేణి సంగమంలోని రామచంద్రజీ మఠానికి ఎప్పటిలాగానే అవకాశం కల్పించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులకు ఉచిత వసతి, అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. జనవరి 13న మొదలైన ఈ కుంభమేళా 45 రోజుల పాటు సాగి ఫిబ్రవరి 26 మహాశివరాత్రితో ముగియనుంది.

అందరూ తరలిరండి..



శ్రీ రామచంద్రజీ మఠం తరఫున హనుమాన్ ధ్వజానికి ఊరేగింపు అనంతరం స్నానాలు నిర్వహించి స్నానాలు ఆచరించి నిత్యం పూజలు నిర్వహిస్తున్నాం. గంగా యమున, సరస్వతి త్రివేణి సంగమంలో దిగంబర బాబా లు, నాగసాధువులు, మహా ఋషులు తరలివచ్చి రాబోయే రోజుల్లో కుంభమేళాలో స్నానాలు ఆచరిస్తారు. ఇలాంటి వారి దర్శనంతో పాటు ఈ స్నానాలు ఆచరించే అదృష్ట భాగ్యాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలి.

– 1008 రాహుల్‌దాస్ బాబా